సాక్షి పెద్దపల్లి

గురువారం । 16 । ఫిబ్రవరి । 2023



ధర్మపురిలో భక్తుల రద్దీ

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో బుధవారం భక్తుల రద్దీ నెలకింది. స్వామివారిని దర్శించుకున్న భక్తులు పూజలు చేశారు.



మహాజాతరకు ముస్తాబు

వేములవాడ: శ్రీరాజరాజేశ్వరస్వామి మహాశివరాత్రి జాతరకు ముస్తాబు అవుతోంది. అధికారులు ఏర్పాట్లు వేగవంతం చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.0/16.0

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఎండతీవ్రత, ఉక్కపోత ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

ఆద్యంతం.. ఆసక్తికరం..!



సింగరేణి ఉద్యోగుల క్లబ్‌డే సందర్భంగా సంస్థ రామగుండం డివిజన్‌-2 పరిధి.. యైటింక్లయిన్‌కాలనీ సీఈఆర్‌ క్లబ్‌లో పోటీలు నిర్వహించారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదక, వంటింటి పనుల్లో నిమగ్నమయ్యే ఉద్యోగులు, వారి కుటుంబాల్లో మానసికోల్లాసం కలిగించేందుకు యాజమాన్యం ఈ పోటీలు ఏర్పాటు చేసింది. మొదటిరోజు పోటీల్లో మహిళా ఉద్యోగులు పాల్గొని చిన్న పిల్లల్లా ఎగిరి గంతేశారు. 8లో▸









న్యూస్‌రీల్‌

కంటి పరీక్షలకు అసౌకర్యం కలిగించొద్దు



వివరాలు తెలుసుకుంటున్న కుమార్‌ దీపక్‌

రామగిరి(మంథని): కంటి పరీక్షలకు వచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌ కుమార్‌ దీపక్‌ సూచించారు. మండలంలోని ఆదివారంపేట, పెద్దంపేటలో కంటివెలుగు కార్యక్రమాన్ని బుధవారం సందర్శించారు. ఇప్పటివరకు ఎంతమందికి పరీక్షలు నిర్వహించారు..? ఎంతమందికి ఆపరేషన్‌ అవసరం ఉంది..? ఎంత మందికి కళ్లద్దాలు అందించారు..? అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ ఆరెల్లి దేవక్క, ఎంపీడీఓ ఇనుముల రమేశ్‌, ఎంపీఓ కాటం భాస్కర్‌, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, వైద్యులు చంద్రశేఖర్‌, ప్రదీప్‌, హిమబిందు, హెల్త్‌ సూపర్‌వైజర్‌ లక్ష్మి పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి చదరంగ పోటీలు

పెద్దపల్లిరూరల్‌: సీఎం కేసీఆర్‌ జన్మదినం సందర్భంగా మహిళలకు జిల్లాస్థాయి చదరంగ పోటీలు నిర్వహిస్తున్నట్లు యువజన క్రీడల అధికారి తిరుపతిరావు తెలిపారు. జిల్లాకేంద్రంలోని అమర్‌చంద్‌ కల్యాణ మండపంలో నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ పేర్లను సెల్‌నంబరు 95153 42207లో నమోదు చేసుకోవాలని కోరారు. విజేతలకు 17న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు.

పిల్లల్లో మానసిక ఒత్తిడి తగ్గించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

పెద్దపల్లిరూరల్‌: పిల్లల్లో మానసిక ఒత్తిడి తగ్గించేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై పాఠశాలలు, కాలేజీల్లో అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్‌ ప్రమోద్‌కుమార్‌ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో వైద్యాధికారులతో సమావేశమయ్యారు. పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురయ్యే అవకాశముందని, ఈ క్రమంలో వైద్యాధికారులు తమ పరిధిలోని పాఠశాలలు, కాలేజీలో చదివే విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. వైద్యాధికారులు పురుషోత్తం, సుధాకర్‌, సాద్విమైథిలి ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.1,00,116 విరాళం



విరాళం అందించిన జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్‌

జూలపల్లి: మండలంలోని తేలుకుంట శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయం నిర్మాణానికి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్‌ తన తండ్రి నారాయణ /జ్ఞాపకార్థం రూ.1,00,116 విరాళం అందించారు. గ్రామంలో 1991–92లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు రూ.25లక్షలతో ఆలయం నిర్మాణానికి ముందుకురావడం అభినందనీయమన్నారు. ఆలయాన్ని అర్చకుడిని నియమించి నిత్యపూజలకు కృషి చేయాలన్నారు. సర్పంచ్‌ సొల్లు పద్మ, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు శాతల్ల కాంతయ్య, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు దండే వెంకటేశ్వర్లు, చిప్ప శ్రీకాంత్‌, నీవూరి మల్లేశం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇక అంజనాద్రిగా కొండగట్టు

యాదాద్రి తరహాలో అభివృద్ధి, పునర్నిర్మాణం

- ఆలయాభివృద్ధి ఖర్చుకు వెనకాడనన్న సీఎం
- పనులు పూర్తయ్యే వరకు వస్తూనే ఉంటా..
- భక్తులకు ఎలాంటి ఇబ్బందీ కలగవద్దు
- మాల విరమణ దీక్షాపరులకు ప్రత్యేక సదుపాయాలు
- కాటేజీల నిర్మాణానికి ముందుకు వచ్చిన మంత్రి గంగుల కమలాకర్‌
- రెండుగంటలపాటు ఆలయ అభివృద్ధిపై ముఖ్యమంత్రి సమీక్ష

సాక్షి ప్రతినిధి, కరీంనగర్‌/కొండగట్టు: యాదాద్రి తరహాలో కొండగట్టు పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం కేసీఆర్‌ అన్నారు. బుధవారం కొండగట్టు ఆలయం అభివృద్ధి, విస్తరణ మాస్టర్‌ప్లాన్‌ తదితరాలపై నిర్వహించిన సుదీర్ఘ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొని పలు సూచనలు చేశారు. ఉదయం 11 గంటల సమయంలో హెలీక్యాప్టర్‌లో కొండగట్టుకు వచ్చిన సీఎం.. జేఎన్టీయూ హెలీప్యాడ్‌ నుంచి నేరుగా బస్సులో నేరుగా ప్రధానాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- ఉదయం 11.25 నుంచి 12.05 గంటల వరకు జరిగిన పూజల్లో పాల్గొన్నారు.
- మ.12.15 గంటల నుంచి మ.2.20 నిమిషాల వరకు ఆలయం, పరిసరాల్లో భక్తుల కోసం కల్పించాల్సిన సౌకర్యాలపై పండితులు, వాస్తు, ఇంజినీరింగ్‌ నిపుణులు, మిషన్‌భగీరథ, అటవీ, పర్యాటక శాఖ, దేవాదాయ అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు.
- ఆలయ అభివృద్ధికి ఖర్చు విషయంలో వెనకాడేది లేదని, ఇప్పుడు విడుదల చేసిన రూ.100 కోట్లకు మరో రూ.1000 కోట్లయినా ఇచ్చేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని సీఎం స్పష్టంచేశారు. ఆగమశాస్త్రం ప్రకారం.. వాస్తు నియమాలకు అనుగుణంగా యాదాద్రి తరహాలో అంజనాద్రి గా తీర్చిదిద్దడమే ధ్యేయమని స్పష్టం చేశారు.

క్యూలైన్లు విస్తరించాలి..

సమావేశం ప్రారంభంలోనే.. దేవాలయాన్ని భక్తుల అవసరాలకు అనుగుణంగా విస్తరించడానికి సేకరించాల్సిన భూములు, సంబంధించిన అంశాలపై లొకేషన్‌ మ్యాపులను సీఎం పరిశీలించారు. వైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించి ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధిని చేపట్టనున్నట్లు స్పష్టంచేశారు. శని, మంగళవారాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లు విస్తరించాలన్నారు.

- భక్తుల కోసం గుట్ట మీద కాటేజీల నిర్మాణానికి దాతలను ఆహ్వానించాలన్నారు. ఇప్పటికే శ్వేత గ్రానైట్స్‌ వారు నిర్మించిన కాటేజ్‌.. విస్తరణలో పోతున్నందున దాన్ని తిరిగి నిర్మిస్తామని మంత్రి గంగుల కమలాకర్‌ ముందుకు వచ్చారు. అందుకు తగిన స్థలాన్ని కేటాయించాలని కోరారు. మంత్రి చొరవను సీఎం అభినందించారు. కళ్యాణ కట్ట దగ్గర పుష్కరిణిలు ఏర్పాటు చేయాలన్నారు. కల్యాణ కట్ట పుష్కరిణి పక్కపక్కన ఉండటంతోపాటు స్త్రీలు, పురుషులకు ప్రత్యేక పుష్కరిణులు ఏర్పాటు చేయాలన్నారు. కొండగట్టులోని అటవీ సంపదను పరిరక్షించేలా బందీపూర్‌ అభయారణ్యం తరహాలో గుట్టపై అడవిని వృద్ధి చేయాలన్నారు. ఆలయ స్థల పురాణం పుస్తకాలను ముద్రించాలని, రాష్ట్రంలోని అన్ని ఆలయాల స్థల పురాణ పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో కొండపైకి వచ్చే వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఘాట్‌రోడ్డును విస్తరించాలని ఇంజినీరింగ్‌ అధికారులకు సూచించారు.
- సమీక్ష సమావేశంలో మంత్రులు, కొప్పుల ఈశ్వర్‌, ఇంద్రకరణ్‌ రెడ్డి, గంగుల కమలాకర్‌, ఎంపీ దివకొండ దామోదర్‌ రావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌, ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్‌, రసమయి బాలకిషన్‌, బాల్క సుమన్‌, జీవన్‌రెడ్డి, సంజయ్‌, కె.విద్యాసాగర్‌ రావు, కోరుకంటి చందర్‌, మండలి చీఫ్‌ విప్‌ భాను ప్రసాద రావు, ఎమ్మెల్సీ ఎల్‌.రమణ, సివిల్‌ సప్లయిస్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ రవీందర్‌సింగ్‌, కలెక్టర్‌ యాస్మిన్‌ భాషా, ఆలయ స్తపతి ఆనందర్‌ సాయి, వాస్తు సలహాదారు సుద్దాల సుధాకర్‌ తేజ, ఆలయ ఈఓ వెంకటేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

మీడియాకు, భక్తులకు నో ఎంట్రీ..!

సీఎం పర్యటన సందర్భంగా గుట్టపైన భద్రత కట్టుదిట్టం చేశారు. కేవలం కొండగట్టులో పనిచేసే దేవాదాయ, శానిటేషన్‌ సిబ్బంది మినహా గుట్టపై వ్యాపారులను సైతం అనుమతించలేదు. భక్తులకు గుట్ట మీదకు ప్రవేశం లేదన్న సంగతి తెలియక మధ్యాహ్నా వరకు కిందనే ఇబ్బందులు పడ్డారు. చివరికి మీడియాకు సైతం ప్రవేశం లేకపోవడం గమనార్హం. మంగళవారం సాయంత్రమే గుట్టపై ఉన్న వారిని ఖాళీ చేయించారు. రాత్రి నుంచి గుట్టను పోలీసులు పూర్తిగా స్వాధీనంలోకి తీసుకున్నారు. ఎస్పీ భాస్కర్‌ నేతృత్వంలో దాదాపు 2,000 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, డీఐజీ రమేశ్‌ నాయుడు, సిరిసిల్ల ఎస్పీ అఖిల్‌ మహాజన్‌, మరో ఇద్దరు ఎస్పీలు, 20 మంది డీఎస్పీలు, 40 మంది సీఐలు, 150 మంది ఎస్సైలు ఇతర అధికారులు పాల్గొన్నారు. ముందురోజు అర్ధరాత్రి వరకు సీఎం కార్యదర్శి స్మితాసబర్వాల్‌, కలెక్టర్‌ యాస్మిన్‌ భాషా కొండపై సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు.

సీఎంకు ఘనస్వాగతం.. సన్మానం



సీఎం కేసీఆర్‌కు అంజన్న చిత్రపటం అందిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

- నాచుపల్లి జేఎన్టీయూలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌లో సీఎం దిగగానే.. స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు ఘనస్వాగతం పలికారు.
- బస్సు నుంచి దిగాక.. ప్రధాన ఆలయంలోకి ప్రధాన పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.
- అనంతరం ఆలయ పరిసరాలను సీఎం కలియతిరిగారు. ప్రతీ నిర్మాణం గురించి వాస్తు నిపుణులను అడిగారు.
- ఇక ఆలయ మాస్టర్‌ప్లాన్‌కు సంబంధించి మ్యాపులను స్వయంగా పరిశీలించారు. అందులోని పలు నిర్మాణాల విషయంలో సూచనలు చేశారు.
- దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సుంకెరవిశంకర్‌ ముఖ్యమంత్రిని శాలువాతో సత్కరించారు. కొండగట్టు ఆలయ చిత్రాన్ని బహూకరించారు.



అంజన్నకు మొక్కులు చెల్లించుకుని బయటకు వస్తున్న సీఎం కేసీఆర్‌

అంజన్న ఆలయ అభివృద్ధే ముఖ్యమంత్రి ధ్యేయం

- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌



కొండగట్టు(చొప్పదండి): కొండగట్టుకు సీఎం కేసీఆర్‌ వచ్చి వెళ్లడం చాలా సంతోషమని.. సూర్యచంద్రులు ఉన్నంత వరకు చంద్రశేఖరుడుంటాడని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ అన్నారు. 600 నుంచి వెయ్యి కోట్లతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కొండగట్టు ఆలయాన్ని చరిత్రలో నిలిచిపోయేలా చేయడం ఆనందంగా ఉందన్నారు. పదిరోజుల్లో కరీంనగర్‌ వచ్చి ఆలయానికి మరోసారి కేసీఆర్‌ రానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సీఎం సారొచ్చారని..

- భక్తులను కొండపైకి అనుమతి ఇవ్వని అధికారులు
- దిగువ కొండగట్టులో హనుమాన్‌ విగ్రహానికి మొక్కులు

కొండగట్టు(చొప్పదండి): ముఖ్యమంత్రి కేసీఆర్‌ కొండగట్టు పర్యటన సందర్భంగా పోలీసుల, అధికారుల ఆంక్షలతో సాధారణ భక్తులు అవస్థలు ఎదుర్కొన్నారు. బుధవారం ఉదయం నుంచే పోలీసులు కొండగట్టును మొత్తం తమ ఆధీనంలోకి తీసుకోగా.. కొండపైకి ఇతరులను, భక్తులను అనుమతించలేదు. దిగువ కొండగట్టులో బారికేడ్లు ఏర్పాటు చేసి కొండపైకి వెళ్లేవారిని అడ్డుకున్నారు. సీఎం పర్యటన విషయం తెలియక అంజన్న దర్శనానికి కొండగట్టు వచ్చిన భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిన్నపిల్లలు ఎండకు అలమటించారు. అంజన్న దర్శనానికి అవకాశం లేకపోవడంతో దిగువకొండగట్టు బస్టాండు వద్ద ఉన్న హనుమాన్‌ విగ్రహానికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించి.. వెనుదిరిగారు.



భక్తులను కొండపైకి అనుమతించని పోలీసులు



హనుమాన్‌ విగ్రహానికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ఎంపికైన లబ్ధిదారులకే డబుల్‌ ఇళ్లు కేటాయించాలి

- కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్‌.రాజ్‌ఠాగూర్‌



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న రాజ్‌ఠాగూర్‌

గోదావరిఖని: గతంలో లాటరీ ద్వారా ఎంపికైన లబ్ధిదారులకే మొదటగా డబుల్‌ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్‌.రాజ్‌ఠాగూర్‌ అన్నారు. రామగుండం కార్పొరేషన్‌ పరిధి 33, 34 డివిజన్లలో బుధవారం పర్యటించారు. ప్రజలను కలుసుకుని వారి సమస్యలు తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్‌, డీజిల్‌, గ్యాస్‌ ధరలను పెంచి మధ్య తరగతి వ్యాపారుల బతుకులను ఛిన్నాభిన్నం చేశాయన్నారు. జీఎస్టీ పేరుతో భారీగా పన్ను విధించి పేదల నడ్డి విరుస్తున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తే గ్యాస్‌ సిలిండర్‌ను కేవలం రూ.500కే అందించడంతోపాటు, సొంత జాగా ఉన్న నిరుపేదలకు ఇల్లు కట్టుకోవడానికి రూ.5లక్షలు అందిస్తామని వెల్లడించారు. ఆసుపత్రులకు వైద్య పరికరాలను ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేయాలే తప్ప.. మధ్యవర్తుల ద్వారా ఉండకూడదన్నారు. ఇక్కడి శాసనసభ్యుడి అండదండలతోనే ఈ వ్యవహారమంతా సాగుతోందని, ఈ విషయాన్ని గోదావరిఖని అంతా కోడై కూస్తోందని తెలిపారు. ఇలాంటి అవినీతి పనులు మానుకుని ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని ఎమ్మెల్యేకు హితవు పలికారు. కాంగ్రెస్‌ పార్టీ అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. డివిజన్ల అధ్యక్షులు ఎర్ర మధు, దొంతుల లింగం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు ఎండీ.ముస్తఫా, బొంతల లచ్చన్న, నాయిని ఓదెలు, కొప్పుల శంకర్‌, పాతపెల్లి రవికుమార్‌, చుక్కల శ్రీనివాస్‌, గట్ల రమేష్‌, తాళ్లపెల్లి యుగేందర్‌, పంజా శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

నేడు మిషన్‌ భగీరథ ఈఈతో 'సాక్షి' ఫోన్‌ఇన్‌



శ్రీనివాస్‌, ఈఈ, మిషన్‌భగీరథ (ఇంట్రా)

పెద్దపల్లిరూరల్‌: జిల్లాలో మిషన్‌ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తాగునీటి సరఫరాలో ఉన్న ఇబ్బందులు, సమస్యలను ప్రజలు ఈఈ శ్రీనివాస్‌ దృష్టికి తీసుకెళ్లే అవకాశం కల్పిస్తోంది 'సాక్షి'. ఆయనతో గురువారం 'సాక్షి ఫోన్‌ ఇన్‌' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. జిల్లా ప్రజలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లవచ్చు.

సాక్షి ఫోన్‌ ఇన్‌

తేదీ: 16 - 02 - 2023
సమయం: మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటిగంట వరకు..
సెల్‌ నంబరు: 91001 21015

విత్తన డీలర్లకు డిప్లొమా కోర్సు

- రైతులకు మంచి సలహాలు అందించేందుకే...
- 48 వారాల పాటు శిక్షణ
- ముందుకొచ్చిన 170 మంది డీలర్లు
- తొలివిడత 80 మందికి శిక్షణ
- కలెక్టర్‌ సంగీత వెల్లడి



విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల డీలర్లకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్‌, అధికారులు

పెద్దపల్లిరూరల్‌: రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు విక్రయించే డీలర్లకు డిప్లొమా కోర్సును అందుబాటులోకి తెచ్చారు. జిల్లాలో 341 మంది డీలర్లు ఉండగా.. వీరిలో 170 మంది కోర్సులో చేరేందుకు ఆసక్తి కనబర్చారు. అయితే తొలివిడత 80మందిని ఎంపిక చేసి వారికి 48 వారాలపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్‌ సంగీత తెలిపారు. నిత్యం రైతులతో సంబంధాలు ఉన్న డీలర్లకు సంపూర్ణమైన అవగాహన కల్పించేలా 'నేషనల్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ అగ్రికల్చర్‌ ఎక్స్‌టెన్షన్‌ మేనేజ్‌మెంట్‌' ఆధ్వర్యంలో నిర్వహించిన డిప్లొమా ఇన్‌ అగ్రికల్చర్‌ సర్వీసెస్‌ ఫర్‌ ఇన్‌పుట్‌ డీలర్లు కార్యక్రమంలో భాగంగా బుధవారం కలెక్టర్‌ సంగీత ఈ కోర్సును లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులను పారా ఎక్స్‌టెన్షన్‌ నిపుణులుగా తీర్చిదిద్దేందుకు క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొనే రోజువారీ సమస్యలు పరిష్కరించడమే ప్రధాన ఉద్దేశమని కలెక్టర్‌ పేర్కొన్నారు.

ఇద్దరు ఫెసిలిటేటర్ల నియామకం

ప్రస్తుత సంవత్సరంలో కోర్సులో చేరే 80 మంది డీలర్లకు శిక్షణ ఇచ్చేందుకు ఇద్దరు ఫెసిలిటేటర్లను నియమించారని కలెక్టర్‌ వివరించారు. ఇన్‌పుట్‌ డీలర్లకు వారానికి ఒక రోజు శిక్షణ ఉంటుందని, ఆత్మ, కేవీకే అధికారులు నోడల్‌ అధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు. ప్రతివారం మార్కెట్‌ సెలవు రోజున డిప్లొమా కోర్సు తరగతులుంటాయని వివరించారు. 40 వారాలు తరగతులు, 8వారాల పాటు క్షేత్రస్థాయి పరిశీలన ఉంటుందని కలెక్టర్‌ తెలిపారు. ఏడీఏ ఆదిరెడ్డి, ఫెసిలిటేటర్‌ రామచంద్రారెడ్డి, కొమురయ్య, కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్‌, రిసోర్స్‌పర్సన్లు, డీలర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రామగుండం సీపీని కలిసిన జనక్‌ప్రసాద్


సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని(రామగుండం): రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరిని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పారిశ్రామిక ప్రాంతంలో శాంతి భద్రతల పరిరక్షణ, మత్తు పదార్థాల బారిన పడుతున్న యువతకు కౌన్సెలింగ్ చేయాలని, ఉద్యోగాల పేరుతో దళారులు మోసం చేస్తున్నారని, అలాంటి దళారుల మీద ఉక్కుపాదం మోపాలని కోరారు. ఆయన వెంట నాయకులు నర్సింహారెడ్డి, ధర్మపురి, వంగ లక్ష్మీపతిగౌడ్, రవీందర్‌రెడ్డి, బర్ల మనోహర్, తాటి రాజయ్య ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

సుల్తానాబాద్(పెద్దపల్లి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను మండల కేంద్రంలో రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. బుధవారం మానేరు వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న 7 ట్రాక్టర్లను పట్టుకొని తహసీల్ కార్యాలయానికి తరలించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణా చేస్తే జరిమానా విధించడంతోపాటు భవిష్యత్తులో వాహనాలను సీజ్ చేస్తామని తహసీల్దార్ యాకన్న తెలిపారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న లారీలు..


పట్టుబడిన లారీలు

పాలకుర్తి(రామగుండం): పెద్దపల్లి మండల రాగినేడు గ్రామశివారు బసంత్‌నగర్ విమానాశ్రయం సమీపంలో సర్వే నంబర్ 301లో గల అసైన్డ్‌భూమి నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు లారీలను మంగళవారం వేకువజామున బసంత్‌నగర్ పోలీసులు పట్టుకున్నారు. కొద్దిరోజులుగా ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని సమీప ప్రాంతాలకు తరలించి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న నేపథ్యంలో విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి రెండు లారీలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

కమాన్‌పూర్(మంథని): మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన పెండ్యాల సంతోష్(23) చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. సంతోష్ ఏ పని లేక ఇంటి వద్దే ఉంటూ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. మూడురోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక ముందు తాగాడు. కుటుంబ సభ్యులు 108 వాహనంలో పెద్దపల్లికి, పరిస్థితి విషమించి కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ బుధవారం వేకువజామున మృతిచెందాడు. మృతుడి తండ్రి ఓదెలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్‌మస్తాన్ తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



కార్మిక కుటుంబాలకు ఆటల పోటీలు

- కన్నుల పండువగా సాగిన ఉద్యోగుల ఫ్యామిలీ వేడుకలు
- ఆకట్టుకున్న మహిళల ఆటల పోటీలు

గోదావరిఖని(రామగుండం): చిన్నపిల్లల్లా ఎగిరి గంతేశారు.. బాల్యంలోని ఆటలను గుర్తుచేసుకున్నారు.. మూడు గంటల పాటు మహిళల ఆటల పోటీలు ఆసక్తికరంగా సాగాయి. మ్యూజికల్ చైర్, షటిల్, క్యారమ్, చెస్ పోటీల్లో వయస్సును మరిచి పాల్గొన్నారు. కరోనా కారణంగా మూడేళ్లుగా క్లబ్ డే నిర్వహించలేదు. చాలా రోజుల తర్వాత పోటీలు నిర్వహించడంతో మహిళలు పోటీపడ్డారు. సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధి యైటింక్లయిన్‌కాలనీ సీఈఆర్ క్లబ్‌లో సింగరేణి ఉద్యోగుల క్లబ్ డే సందర్భంగా నిర్వహించిన పోటీలు సంతోషంగా సాగాయి. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, నిత్యం వంటింటి పనుల్లో నిమగ్నమయ్యే ఉద్యోగులు, వారి కుటుంబాల్లో సంతోషాన్ని నింపేందుకు యాజమాన్యం ఈ పోటీలను ఏర్పాటు చేసింది. యాజమాన్యం నిర్వహిస్తున్న పోటీలతో తోటి ఉద్యోగుల కుటుంబాల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడింది.





టగ్ ఆఫ్ వార్ నిర్వహిస్తే బాగుండు


అందరినీ ఉత్సాహపరిచే టగ్‌ఆఫ్‌వార్ పోటీ కూడా ఉంటే చాలా ఉత్సాహంగా ఉంటుంది. ఇంకా ఎక్కువ మంది మహిళలు పాల్గొనేలా యాజమాన్యం ప్రోత్సహించాలి. నిత్యం కుటుంబ ఒత్తిళ్లతో వంటింటికే పరిమితమయ్యే మాకు ఈ పోటీలు చాలా రిలాక్స్‌నిచ్చాయి. – ఎ.సుజాత, గృహిణి

చిన్నపిల్లల్లా పాల్గొన్నాం


చిన్నపిల్లల్లా ఆటల పోటీల్లో పాల్గొన్నాం. దీనివల్ల కుటుంబాల మధ్య మరింత సాన్నిహిత్యం ఏర్పడింది. చాలా కుటుంబాలు పరిచయమయ్యాయి. షటిల్, మ్యూజికల్ చైర్ పోటీల్లో పాల్గొన్నా. బహుమతుల కన్నా ఆటల పోటీలు సంతోషాన్నిచ్చాయి. – ఎ.కాత్యాయిని, ఉద్యోగి భార్య

ఎంజాయ్ చేశాం


ఆటల పోటీల్లో పాల్గొని ఎంజాయ్ చేశాం. ఇలాంటి పోటీలు ఏడాదికోసారి కాకుండా నెలకోసారి నిర్వహిస్తే బాగుంటుంది. చిన్నపిల్లలతో కలిసి ఆటల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది. మూడేళ్ల తర్వాత పోటీలు జరగడం అందులో పాల్గొనడం కొత్త అనుభూతినిచ్చింది. – కె.అరుణ, గృహిణి

సంతోషంగా ఉంది


చాలా రోజుల తర్వాత ఆటల పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉంది. వయస్సును మరిచి ఆటల పోటీల్లో పాల్గొన్నాం. ఇలాంటి పోటీలు నెలకోసారి నిర్వహిస్తే బాగుంటుంది. క్లబ్ డే సందర్భంగా పోటీలు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది.
– కె.వెంకటలక్ష్మి, గృహిణి

మూడేళ్ల తర్వాత..


మూడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత క్లబ్ డే వేడుకలు ఏర్పాటు చేశాం. కోవిడ్ మూలంగా 2019 తర్వాత వేడుకలు జరగలేదు. ఈసారి ఉత్సాహభరితమైన వాతావరణంతో పోటీలను ఏర్పాటు చేశాం. క్లబ్ డే వేడుక ఘనంగా నిర్వహించేలా ప్లాన్ చేశాం.
– హమీద్, సీఈఆర్ క్లబ్ సెక్రెటరీ

నిశ్చితార్థం ఇంట్లో విషాదం

- హైదరాబాద్ నుంచి వస్తుండగా కారు ప్రమాదం
- ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు


మృతుడి ఇంటివద్ద విషాదఛాయలు

గోదావరిఖని(రామగుండం): తెల్లవారితే నిశ్చితార్థం.. ఆ లోపే కారు ప్రమాదం రూపంలో దూసుకొచ్చిన మృత్యువు ఆ కుటుంబంలో విషాదం నింపింది. తమ్ముడి నిశ్చితార్థం కోసం గోదావరిఖని వస్తున్న క్రమంలో కారు ప్రమాదానికి గురై అన్న అక్కడికక్కడే మృతి చెందగా, ముగ్గురు గాయాలపాలైన ఘటన గోదావరిఖనిలోని మార్కండేయ కాలనీలో విషాదం నింపింది. స్థానికుల వివరాలు.. గోదావరిఖని మార్కండేయకాలనీకి చెందిన సింగరేణి మాజీ కార్మికుడు తాటిపాముల రాజనర్సయ్య పెద్దకుమారుడు అరవింద్ (33) గృహ ప్రవేశం హైదరాబాద్‌లో ఉండగా, మూడురోజుల క్రితం అరవింద్, అతడి భార్య నవ్య, తల్లి కవిత, అత్తమ్మ భారతి, పిల్లలు హిమాన్ష్, కృతికశ్రీ, సోదరుడు మహేశ్ కారులో వెళ్లారు. గురువారం గోదావరిఖనిలో మహేశ్ నిశ్చితార్థం ఉండడంతో బుధవారం ఉదయం కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఈక్రమంలో సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ శివారులో కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొని రోడ్డుకిందకు దూసుకెళ్లి మూడు పల్టీలు కొట్టింది. ప్రమాదంలో అరవింద్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలినవారిని 108లో ఆస్పత్రికి తరలించారు. మహేశ్‌కు తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్నాడు. రాజనర్సయ్య భార్య చేయికి గాయమైంది. అరవింద్ భార్య వెన్నెముక దెబ్బతింది. తెల్లవారితే శుభకార్యం జరగాల్సిన ఇంట్లో ప్రమాదం చోటుచేసుకుని ఇంటి పెద్ద కొడుకు మృతిచెందడంతో కాలనీలో విషాదఛాయలు నెలకొన్నాయి. కాగా అరవింద్ ఇందారంఖని–1వ గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్నాడు.


అరవింద్(ఫైల్)

బస్సులో రావడంతో ఇంటి పెద్దకు తప్పిన ముప్పు

హైదరాబాద్ వెళ్లేటప్పుడు అందరు కారులో వెళ్లినా.. తిరిగి వచ్చే సమయంలో కారులో ఇరుకుగా ఉండటంతో ఇంటి పెద్ద రాజనర్సయ్యను జూబ్లీహిల్స్ బస్టాండ్ వద్ద బస్సులో ఎక్కించారు. దీంతో ప్రమాదం నుంచి అతడు బయటపడ్డాడు.

మల్లన్న సన్నిధిలో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

- స్వామివారిని దర్శించుకున్న భక్తులు
- ఉదయం నుంచే ప్రత్యేక పూజలు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి ఆలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు వీరభద్రయ్య, ఈవో మేకల మల్లేశంయాదవ్, ఈవో సదయ్య ఆధ్వర్యంలో గణపతి, గౌరీపూజలు చేశారు. అఖండ దీపారాధన, హారతి, మంత్రపుష్పం జరిగాయి. సాయంత్రం ధ్వజారోహణం, శివయాగ మంటపస్థాపన, ప్రధాన కలశ స్థాపన, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ చేపట్టారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాలనుంచి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు భ్రమరాంభ, మల్లికార్జునస్వామి కళ్యాణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం భ్రమరాంభ, మల్లికార్జున స్వామి కల్యాణం జరగనుంది. స్వామివారికి పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.


దర్శనం కోసం వచ్చిన భక్తులు

ఈజీఎస్ పనుల్లో వేగం పెంచాలి

- సీసీ రోడ్డు పనులు ఆన్‌లైన్‌లో నమోదు కావాలి
- మార్చి 15 వరకు మన ఊరు – మనబడి పనులు పూర్తి
- ధర్మారం ఏఈ పనితీరు మారకపోతే చర్యలు
- అధికారుల సమావేశంలో కలెక్టర్ సంగీత


మాట్లాడుతున్న కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచి సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సంగీత సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలో 497సీసీ రోడ్డుపనులను రూ.25కోట్లతో పూర్తి చేసేందుకు అనుమతులిచ్చామని, ఎంపీడీఓలు తమ మండలాల్లో పనులు పూర్తయ్యేలా చొరవ చూపాలని, మొదలుకాని పనులు రద్దు చేయాలని ఆదేశించారు. జిల్లాలో 98 పంచాయతీ భవన నిర్మాణాలకు అనుమతి వచ్చిందని, వెంటనే ప్రారంభించాలని, పెండింగ్‌లో ఉన్న క్రీడాప్రాంగణాలను త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు.

ధర్మారం ఏఈ తీరుపై అసంతృప్తి

మన ఊరు మనబడి కార్యక్రమం కింద చేపట్టిన పనులను మండలాల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ధర్మారం మండల ఏఈ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆమె.. ఆయనకు మెమో జారీ చేయాలని ఆదేశించారు. వారం రోజుల్లో పనితీరు మెరుగుపర్చుకుని పనుల్లో పురోగతి చూపాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీఆర్‌డీఓ శ్రీధర్, డీఈఓ మాధవి, ఎంపీడీవో, ఏఈ తదితరులున్నారు.

గుర్తుతెలియని మృతదేహం

రామగుండం: అంతర్గాం మండల పరిధి బ్రాహ్మణపల్లి గ్రామ శివారులోని ఓ రైతుకు చెందిన భూమిలో బుధవారం గుర్తుతెలియని, కుళ్లిపోయిన మృతదేహం లభ్యమైంది. పురుషుడిగా భావించిన పోలీసులు 40–45 ఏళ్ల వయస్సు మధ్య ఉండవచ్చని పేర్కొన్నారు. గ్రామ వీఆర్‌ఏ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అంతర్గాం ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు.

బొగ్గుబాయి వార్తలు

ఆర్మీ అభ్యర్థులకు జీఎం సన్మానం


సన్మానించిన జీఎం ఎ.మనోహర్

గోదావరిఖని(రామగుండం): ఆర్మీ అగ్నివీర్‌లో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ బుధవారం సన్మానించారు. జీఎం కార్యాలయంలోని తన చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో ముగ్గురు అభ్యర్థులను శాలువాలతో సన్మానించి అభినందించారు. పరిసర ప్రభావిత గ్రామాల అభివృద్ధికి, నిరుద్యోగ యువతకు సంస్థ ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. మన ఏరియా నుంచి ఆర్మీలో ఉద్యోగాలు సాధించడం సంతోషకరమన్నారు. దేశసేవ చేసే అవకాశం లభించడం ఎంతో అభినందనీయమన్నారు. క్రమశిక్షణతో ఆర్మీలో పని చేసి సింగరేణికి సంస్థకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ జి.రాజేంద్రప్రసాద్, శిక్షకులు బి.దేవారెడ్డి, హనీఫ్, సీఈఆర్ క్లబ్ సెక్రెటరీ హమీద్ పాల్గొన్నారు.

డిప్యుటేషన్ కౌన్సిల్ రద్దు చేయాలి


మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): ఆర్జీ–2 పరిధి ఓసీపీ–3 ప్రాజెక్టులో పనిచేస్తున్న 40 మంది జనరల్ మజ్దూర్ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ అన్నారు. బుధవారం యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నాలుగైదేళ్ల క్రితం 7 ఎల్‌పీ ఇతర విభాగాలకు చెందిన 40 మంది జనరల్ మజ్దూర్ కార్మికులను డిప్యుటేషన్ మీద ఓసీపీ–3 లోకి తీసుకున్నారని, ప్రస్తుతం మళ్లీ అండర్‌గ్రౌండ్‌కు వెళ్లాలని డిప్యూటేషన్ కౌన్సిల్ చేస్తూ ఆర్డర్లు ఇవ్వడం సరికాదన్నారు. డిప్యుటేషన్ అనేది నాలుగైదు నెలలకు ఇచ్చేది తప్ప నాలుగైదేళ్ల వరకు కొనసాగించేది కాదన్నారు. టీబీజీకేఎస్, ఏఐటీయూసీ సంఘాల నాయకులు డబ్బులు దండుకోవడం తప్ప కార్మికుల పక్షాన మాట్లాడినపాపన పోలేదన్నారు. అధికారులకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డిప్యుటేషన్ కౌన్సిల్ రద్దు చేసి ఉన్నచోటనే కొనసాగించి కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే జీఎం కార్యాలయం, ప్రాజెక్టు కార్యాలయాన్ని కార్మికుల కుటుంబ సభ్యులతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు దావు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాల జీవో అమలు చేయాలి


మాట్లాడుతున్న భూపాల్

గోదావరిఖని(రామగుండం): కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనాల జీవో వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కమిటీ సమావేశం స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం 73 షెడ్యూల్‌లో పరిశ్రమల కనీస వేతనాల జీవోలను సవరించకుండా తొమ్మిదేళ్లుగా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలన్నారు. దీనికోసం పలు దఫాలుగా ఆందోళన, పోరాట కార్యక్రమాలు నిర్వహించినా పట్టించుకోవడం లేదన్నారు. సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, రైస్‌మిల్ తదితర పరిశ్రమల్లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాల జీవో అమలు చేయాలన్నారు. దీని కోసం బుధవారం నుంచి వచ్చేనెల 1వరకు ఆందోళనలు, పోరాట కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా ఈనెల 15 నుంచి 20 వరకు సర్వేలు, 21, 22 తేదీల్లో కార్మికుల సంతకాల సేకరణ, 25న ధర్నాలు, మార్చి–1న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి, నాయకులు రామాచారి, ఎన్.బిక్షపతి, ఎన్.శంకర్, తాండ్ర అంజయ్య, సీహెచ్ అరవింద్, భూమయ్య, ఉపేందర్, నందిని, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి


సమావేశంలో మైనింగ్ అసోసియేషన్ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణిలో పనిచేస్తున్న అధికారులు, కార్మికులకు సమన్వయంగా పనిచేస్తున్న మైనింగ్ స్టాఫ్‌పై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని మైనింగ్ స్టాఫ్ అసోసియేషన్ కన్వీనర్ మాదాస్ రామ్మూర్తి అన్నారు. బుధవారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. భూపాలపల్లిలో పొరపాటున జరిగిన తప్పిదానికి ముగ్గురు మైనింగ్ సిబ్బందిని బాధ్యులను చేస్తూ ఇంక్రిమెంట్లతో పాటు డిస్మిస్ చేసిన అధికారుల తీరుపై మండిపడ్డారు. అధికారుల తీరుకు నిరసనగా ఆర్జీ–2 ఏరియా మైనింగ్‌స్టాఫ్ నల్లబ్యాడ్జీలు ధరించి అధికారులకు మెమోరండం ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. వేల కోట్ల నష్టానికి బాధ్యులైన అధికారులపై లేని చర్యలు మైనింగ్ సిబ్బందిపై తీసుకోవడం ఎందుకని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంస్థ అభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న మైనింగ్ సిబ్బందిపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని కోరారు. లేకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో నాగెల్లి సాంబయ్య, కె.అనిల్, గణేష్, రాజన్న, శ్రీనివాస్ పి.రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఎన్నికలు ఆలస్యం

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని(రామగుండం): సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల గుర్తింపు సంఘం ఎన్నికలు ఆలస్యం అవుతున్నాయని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య విమర్శించారు. బుధవారం జీడీకే–11గనిలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ నేత శేషగిరిరావు 75వ వర్ధంతిని గనిపై నిర్వహించారు. అధికారుల సంఘం తీరువల్లే 11వ వేజ్‌బోర్డు ఆలస్యం అయ్యిందన్నారు. అధికారుల సంఘం నాయకులు కోలిండియాకు ఇచ్చిన లేఖను వాపస్‌తీసుకోవాలన్నారు. సింగరేణిలో ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణకు వ్యతిరేకంగా అమరజీవి కామ్రేడ్ దేవూరి శేషగిరిరావు అనేక ఉద్యమాలు నిర్వహించి కార్మికులకు హక్కులు సాధించి పెట్టాడన్నారు. ఏఐటీయూసీ చేసే పోరాటాల్లో కార్మిక వర్గం కలిసి రావాలని కోరారు. బొగ్గు గని కార్మికులకు వేజ్‌బోర్డులో 19శాతం వేతనాల పెంపు కోసం అంగీకారం కుదిరినా, మిగతా డిమాండ్‌లను పది రోజుల్లో పరిష్కారం చేసుకొని 11వ వేజ్ బోర్డు ఒప్పందం చేసుకుందామని యాజమాన్యం చెప్పినా అధికారుల సంఘం అడ్డుపుల్ల వేస్తోందన్నారు. వేజ్ బోర్డు ఒప్పందం వల్ల అధికారుల జీతాల కంటే కార్మికుల జీతాలు ఎక్కువ పెరుగుతాయని కుట్రతో కోల్ ఇండియాలోని అధికారుల సంఘం డీపీఈ గైడ్‌లైన్స్ అమలు చేయాలని కోలిండియా యాజమాన్యానికి లేఖ రాసిందన్నారు. లేఖను పక్కన పెట్టి వేజ్‌బోర్డు ఒప్పందం చేయాలని, లేకుంటే సమ్మెకు పిలుపునిస్తామని హెచ్చరించారు. 2012 తర్వాత టీబీజీకేఎస్ తీరుతో కాంట్రాక్టీకరణ పెరిగిందన్నారు. గేట్ మీటింగ్‌లో నాయకులు ఆరెల్లి పోషం, మడ్డి ఎల్లాగౌడ్, రంగు శ్రీనివాస్, మాదన మహేష్, ఎస్.వెంకట్‌రెడ్డి, మిట్ట శంకర్, ఎం.సంపత్, పర్లపెల్లి రామస్వామి, పెద్దెల్లి శంకర్, యాదయ్య, జోసెఫ్, ఆకునూరి శంకరయ్య, గొడిశల నరేశ్, ఉప్పులేటి తిరుపతి, ఆఫీసు కార్యదర్శి తొడుపునూరి రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లయిన ఐదు నెలలకే..

- ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య
- అత్తింటి వేధింపులే కారణమని ఫిర్యాదు


అఖిల(ఫైల్)

గోదావరిఖని(రామగుండం): పెళ్లయిన ఐదునెలలకే వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి విఠల్‌నగర్ ఏరియాలో జరిగింది. ఎస్‌ఐ రమేష్ కథనం ప్రకారం.. కమాన్‌పూర్ మండలం జూలపల్లి గ్రామానికి చెందిన ఇరుగురాల అఖిల(21)ను గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన చిలుముల సూర్యప్రకాశ్ ఐదునెలల కిందట ప్రేమ పెళ్లి చేసుకున్నారు. ఈక్రమంలో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అఖిల ఉరేసుకుని మృతిచెందింది. కట్నం కోసం అత్తింటివారు వేధింపులకు గురిచేయడం వల్లే తన కూతురు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్‌ఐ కేసు నమోదు చేశారు. మృతురాలి భర్త, అత్త, మామ, మరిదిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.